RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 258 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శుక్రవారం, 22 మార్చి 2024 పేజీలు : 4 వెల : 2/-

## పదేళ్ల దోస్త్‌ను పక్కకు నెట్టనున్న 'పతంగి'!

హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీతో మైత్రీబంధాన్ని కొనసాగిస్తున్న బీఆర్ఎస్ పరోక్షంగా ఆ పార్టీకి మద్ధతు ఇచ్చేలా నామ్ కే వాస్తే బలహీన అభ్యర్థిని రంగంలో దించుతోంది. మరో వైపు మజ్లిస్ పార్టీతో దోస్తీ కోసం తహతహ లాడుతున్న అధికార కాంగ్రెస్ పార్టీ కూడా వీక్ అభ్యర్థిని ఇక్కడి నుంచి బరిలోకి దించుతోంది. అంటే ఎవరికి వారు అసదుద్దీన్ ఒవైసీకు పరోక్షంగా లాభించేలా ప్రతిపక్ష బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల వ్యూహాలు రూపొందించాయి. దీంతో హైదరాబాద్ బరిలో ప్రధాన పోటీ మజ్లిస్, బీజేపీల మధ్యనే నువ్వా? నేనా ? అన్నట్లు ద్విముఖ పోరు ఉ ండబోతోందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

మజ్లిస్ కంచుకోటలో మరోసారి విజయం సాధించేందుకు అసదుద్దీన్ ఒవైసీ పావులు కదుపుతుండగా, ఈ సారి హిందువుల ఓట్లను సమీకరించడం ద్వారా తామే విజయం సాధిస్తామని కమలనాథులు వ్యూహాలు రూపొందిస్తున్నారు. దీంతో హైదరాబాద్ పోరు ఆసక్తికరంగా మారింది.

**మజ్లిస్‌తో బీఆర్ఎస్ మైత్రీబంధం కొనసాగేనా? :** హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మైత్రీబంధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మజ్లిస్ పార్టీకి ఉపకరించేలా హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని పొత్తులో భాగంగా బీఎస్పీ అభ్యర్థికి కేటాయించాలని గులాబీ బాస్ కేసీఆర్ మొదట నిర్ణయించారు. కానీ బీఆర్ఎస్ పార్టీతో పొత్తుకు మాయావతి ససేమిరా అనడంతో బీఎస్పీతో పొత్తు వికటించింది. దీంతో ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకొని నాగర్‌కర్నూల్, బీఆర్ఎస్ అభ్యర్థిగా రంగంలోకి దించింది. కానీ హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలోనూ బలహీనమైన బీఆర్ఎస్ అభ్యర్థిని బరిలోకి దించాలని ఆ పార్టీ యోచిస్తోంది.

**మజ్లిస్‌తో కాంగ్రెస్ స్నేహపూర్వక పోటీనా? :** హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ షహనాజ్ తబస్సుమ్‌ను పోటీకి దింపనుంది. నాలుగుసార్లు ఎంపీగా గెలిచిన అసదుద్దీన్ ఒవైసీపై బలహీన అభ్యర్థిని నిలబెట్టడం ద్వారా ఏఐఎంఐఎంపై కాంగ్రెస్ మెతక వైఖరి అవలంబిస్తుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవి లతపై హైదరాబాద్ నియోజకవర్గం నుంచి సుప్రీంకోర్టు న్యాయవాది షహనాజ్ తబస్సుమ్‌ను పోటీకి దింపాలని కాంగ్రెస్ నిర్ణయించింది. తబస్సుమ్ భారత సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది. ఆమె ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ వ్య వస్థాపకురా లు, జాతీయ అధ్యక్షురాలు కూడా. ఇతర పార్లమెంటు స్థానాల్లో మజ్లిస్ మద్దతు పొందడానికి ఆ పార్టీతో పోటీ స్నేహపూర్వకం గా ఉండాలని ఆశిస్తున్నట్లు పాత నగరానికి చెందిన పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ కాంగ్రెస్ నాయకుడు 'ఫెడరల్ తెలంగాణ'కు చెప్పారు. మరో వైపు హైదరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఫ్లాష్ సర్వే ఆధారంగా అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**అధికార పార్టీతో మజ్లిస్‌కు పొత్తు పొడిచేనా? :** 1984వ సంవత్సరం నుంచి జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గంలో ఏఐఎంఐఎం పాగా వేసింది. 2019 ఎన్నికల్లో ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఐదు లక్షలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. దాని సమీప ప్రత్యర్థి బీజేపీకి 2.35 లక్షల ఓట్లతో రెండవ స్థానానికి పరిమితమైంది. రాష్ట్రంలో అధికార పార్టీలతో కలిసి పనిచేసిన చరిత్ర మజ్లిస్ పార్టీకి ఉంది. "అధికార పార్టీతోనే మజ్లిస్ మైత్రీబంధం పెట్టుకోవడం గత చాలారోజులుగా ఆనవాయితీగా కొనసాగుతోంది, ఈ సారి కూడా మజ్లిస్ ఒకవైపు బీఆర్ఎస్ తో అంతర్గతంగా మైత్రీబంధంలో ఉంటూనే, మరో వైపు అదికార కాంగ్రెస్ పార్టీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకోవచ్చు" అని పాతబస్తీకి చెందిన సీనియర్ జర్నలిస్ట్ జి. రమేష్ చెప్పారు.

**కేసీఆర్‌తో ఒవైసీ దోస్తీ :** అంతకుముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకున్న అసదుద్దీన్ ఒవైసీ 2014వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్‌తో దోస్తీ కుదుర్చుకున్నారు. అసద్, కేసీఆర్ ఎప్పుడూ స్నేహపూర్వకంగానే ఉండి 2018, 2023 వసంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో ఒకరికొకరు మద్దతు ఇచ్చుకున్నారు. ఒవైసీ గతంలో తన బహిరంగ ప్రసంగాల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని ముస్లింలను కోరారు. అయినప్పటికీ గత సంవత్సరం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచింది. మజ్లిస్ పార్టీ ఎల్లప్పుడూ అధికార పార్టీలతోనే కలిస ఉండే సంప్రదాయం కొనసాగుతోందని రాజకీయ విశ్లేషకులు పెంటపాటి పుల్లారావు 'ఫెడరల్ తెలంగాణ'కు చెప్పారు. "మజ్లిస్ పార్టీ అటు బీఆర్ఎస్ పార్టీతో మైత్రీబంధాన్ని కొనసాగిస్తూ మరో వైపు అధికార కాంగ్రెస్ పార్టీతో స్నేహం చేస్తోంది" అని పెంటపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఎవరి ప్రభుత్వం అయినా మజ్లిస్ వారితో స్నేహం చేస్తుందని ఆయన వివరించారు.

**ఒవైసీ బ్రదర్స్ తో సీఎం రేవంత్ చెట్టాపట్టాల్...** అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలై కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడంతో అధికార పార్టీతో మజ్లిస్ స్నేహం చేసే అవకాశం కనిపిస్తోంది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎఐఎంఐఎం చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే, అసదుద్దీన్ తమ్ముడు అక్బరుద్దీన్ ఒవైసీని కూడా లండన్‌లో కలిశారు. అనంతరం పాతబస్తీలో మెట్రోరైలు శంకుస్థాపన సభలోనూ సీఎం రేవంత్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెట్టాపట్టాలేసుకొని మేమంతా అభివృద్ధి పనుల కోసం ఒకటేనని ప్రకటించారు. మజ్లిస్, కాంగ్రెస్ వర్గాలు రాజకీయంగా కొంతమేరకు సయోధ్య కుదుర్చుకున్నారనే ఊహాగానాలకు తెరలేచింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మజ్లిస్, కాంగ్రెస్ కొత్త మైత్రీబంధంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**మజ్లిస్, బీజేపీల మధ్య ద్విముఖ పోరు :** హైదరాబాద్ స్థానంలో ప్రధాన పోటీ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీకి, బీజేపీ అభ్యర్థి మాధవీలతల మధ్య ఉంటోందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ పార్టీల పరోక్ష మద్ధతు, ముస్లిం ఓట్లు ఏకపక్షంగా పడితే తానే మరోసారి విజయం సాధిస్తానని సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెబుతున్నారు. అసదుద్దీన్ ఒవైసీ రాత్రివేళ ఓటర్లతో భేటీ అవుతూ ఓట్ల వేట సాగిస్తున్నారు. రమజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఓట్లు చేజారకుండా తనకే పడేలా అసద్ వ్యూహాలు రూపొందిస్తున్నారు. హైదరాబాద్ ఎంపీ స్థానంలో మరోసారి పతంగ్ ఎగరడం ఖాయం అని పాతనగరంలోని చార్మినార్ ప్రాంతానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ ముజాహిత్ 'ఫెడరల్ తెలంగాణ'కు చెప్పారు. "ఎన్నికల్లో ఎవరు పోటీ చేసినా మజ్లిస్ కంచుకోటలో అసదుద్దీన్ ఒవైసీ పకడ్బందీ రాజకీయ వ్యూహాలు రూపొందించి విజయం సాధించవచ్చు"అని ముజాహిద్ వివరించారు. హైదరాబాద్ పార్లమెంటు పోరు ఆసక్తికరంగా సాగుతున్నా, ఈ ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారనేది జూన్ 4వతేదీ ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే.

## మేం గేట్లు తెరిస్తే ఆ పార్టీల్లో ఎవరూ ఉండరు



ఖమ్మం: తాము ఇంకా గేట్లు తెరవలేదని.. తెరిస్తే బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లో నేతలు ఎవరూ ఉండరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి రమ్మని తాము ఎవరిని అడగటం లేదని.. స్వచ్ఛందంగా నేతలే తమ పార్టీలో చేరుతామని వస్తున్నారని వివరించారు. గురువారం నాడు ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొంతమంది నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి చర్యలకు పాల్పడదని.. అధికారం ఎక్కడ కోల్పోతామని కేసీఆర్ భయపడి ఇష్టరీతీగా ఫోన్లను ట్యాప్ చేశారని మండిపడ్డారు.

తమకు అలాంటి భయం లేదని అన్నారు. బీఆర్ఎస్ మీద తాము కక్ష పూరితంగా కేసులు పెట్టలేదన్నారు. ఆ కేసులన్నీ గులాబీ నేతలు అధికార దుర్వినియోగంతో చేసిన తప్పులేనని అన్నారు.

**ఆ విషయంపై కొన్ని మీడియా సంస్థలది దుష్ప్రచారం :** జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోయిన ఫొటోలు, వీడియోలను చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్‌లోనని.. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వలు ఉంచాల్సిన బాధ్యత గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. కానీ కేసీఆర్ చేయాల్సిన పనులు చేయకుండా బాధ్యత విస్మరించి తమపై రాళ్లేయడం తగదన్నారు. కాళేశ్వరం ఫలితం ఎవరికి దక్కిందో అందరికీ తెలిసిందేనని చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒకటి, రెండు ఎంపీ సీట్లు గెలిస్తే గొప్పని చెప్పారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని... తమకు ఎంఐఎం మద్దతు తెలుపుతుందని అన్నారు. తాము చెప్పిందే చేస్తున్నామని.. గత పాలకుల అవినీతి మీద పోరాడుతున్నామన్నారు. కేసీఆర్ వల్ల డిస్టర్బ్ అయిన వ్యవస్థను దారిలో పెడుతున్నామని చెప్పారు. 5 ఎకరాలకు రైతు బంధు ఇస్తామని మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెప్పామని.. చెప్పినట్లే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని అన్నారు. జీతాల చెల్లింపుల్లో కొంత ఆలస్యమైన మాట వాస్తవమేనని చెప్పారు. జీతాలు త్వరగా వేసేలా ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోందని అన్నారు. తాను బీజేపీతో టచ్‌లో ఉ న్నానని అనడం కరెక్ట్ కాదని... కావాలని తనను ట్రోల్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణకి రావాల్సిన నిధులపై కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడేందుకు వెనుకాడబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ మూడో జాబితా.. తెలంగాణలో ఐదుగురికి చోటు

దిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు 57 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ పార్టీ మూడో జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు దక్కింది. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ, మల్కాజిగిరి – సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ – దానం నాగేందర్, చేవెళ్ల– రంజిత్ రెడ్డి, నాగర్‌కర్నూల్ – మల్లు రవిని అభ్యర్థులుగా ఖరారు చేసింది. అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలోని కొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లోని బహరామ్‌పుర్ నుంచి అధీర్ రంజన్ చౌదరీ బరిలో దిగనున్నారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ కర్ణాటకలోని గుల్బర్గా నుంచి, కేంద్ర మాజీ మంత్రి సుశీల్ కుమార్ శిందే కుమార్తె ప్రణితి శిందే మహారాష్ట్రలోని సోలాపుర్ నుంచి పోటీ చేయనున్నారు.

రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గాన్ని సీపీఎంకు కేటాయించింది. తాజా జాబితాతో కలిసి కాంగ్రెస్ ఇప్పటివరకు మొత్తం 139 మంది అభ్యర్థులను ప్రకటించింది. తెలంగాణకు సంబంధించి మొదటి జాబితాలో నాలుగు స్థానాలకు (జహీరాబాద్ – సురేశ్ కుమార్ షెట్కర్, నల్గొండ – కుందూరు రఘువీర్‌రెడ్డి, మహబూబ్‌నగర్– చల్లా వంశీచందర్‌రెడ్డి, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్) అభ్యర్థులను ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఇంకా.. ఖమ్మం, భువనగిరి, నిజామాబాద్, హైదరాబాద్, మెదక్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

## మెదక్ నుంచి రంగంలోకి కేసీఆర్?

### గులాబీ దళపతి వ్యూహాత్మక అడుగులు




**కాంగ్రెస్ అభ్యర్థి తేలాకే ప్రకటించే యోచనలో బీఆర్ఎస్**

**మరోవైపు వంటేరు ఖరారైనట్లుజోరుగా ప్రచారం**

**అధికార, ప్రతిపక్షం అభ్యర్థుల ఎంపికలో వీడని ఉత్కంఠ**

సంగారెడ్డి : మెదక్ లోక్‌సభ అభ్యర్థిత్వం విషయంలో గులాబీ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్ టికెట్‌ను ప్రకటించినప్పటికీ, మెదక్ విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ టికెట్‌ను వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఇవ్వాలని అధినేత కేసీఆర్ పక్షం రోజుల క్రితమే నిర్ణయం తీసుకున్నప్పటికీ ఇంకా అధికారికంగా ప్రకటించడం లేదు. కాంగ్రెస్ అభ్యర్థిత్వం తేలిన తర్వాత ఇక్కడి అభ్యర్థిని ప్రకటించే అవకాశాలున్నాయని గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ టికెట్‌పై ఉత్కంఠ అలాగే కొనసాగుతోంది. కాగా ఈ టికెట్ కోసం మరో ఇద్దరు ముఖ్యనాయకులు పోటీ పడుతున్నారు. మరికొంత మంది కూడా ఆశిస్తున్నారు. ముఖ్యంగా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలువుల మదన్‌రెడ్డి రేసులో ఉన్నారు. కొన్ని నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ టికెట్‌ను సునీతారెడ్డికి ఖరారు చేసిన సందర్భంగా ఆయనకు ఎంపీ టికెట్ ఇస్తామని బీఆర్ఎస్ అధినాయకత్వం హామీ కూడా ఇచ్చింది. అలాగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన గాలి అనిల్‌కు కూడా ఎంపీ టికెట్ ఇస్తామనే హామీ ఇచ్చారు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయనకు జహీరాబాద్ టికెట్ ఖరారు చేశారు. మరోవైపు తమకే కేటాయించాలని సంగారెడ్డికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బీరయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్‌లో చేరిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కూడా అధినాయకత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అధినేత కేసీఆర్ మాత్రం వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వంటేరును లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పని చేసుకోమన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

కానీ అధికారికంగా మాత్రం ప్రకటించకపోవడంతో ఉ త్కంఠ కొనసాగుతోంది. అయితే కాంగ్రెస్ అభ్య ర్థిత్వం ఒకటీ రెండు రోజుల్లో ప్రకటించే అవకాశాలున్నాయి.

బీజేపీ మాత్రం వారం రోజుల క్రితమే ప్రకటించింది. ఈ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు కేటాయించింది. ఆయన నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటున్నారు.

**అధినేతే బరిలోకి దిగుతారనే ప్రచారం? :** ఈ మెదక్ లోక్‌సభ స్థానం నుంచి స్వయంగా అధినేత కేసీఆరే బరిలోకి దిగే అవకాశాలు లేకపోలేదనే ప్రచారం కూడా షురూ అయింది.

అందుకోసమే ఈ అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన రాలేదనే టాక్ జోరందుకుంటోంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలుచుకునే సీట్లలో మెదక్ సీటు ముందుంటుందని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు ఎమ్మెల్యే స్థానాల్లో ఆరు చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించింది. ఒక్క మెదక్ అసెంబ్లీ స్థానం మాత్రం కాంగ్రెస్ గెలిచింది.

ఈ ఎన్నికల్లో కూడా కారు జోరందుకునే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ టికెట్ విషయంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో నెలకొంది.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# ప్రపంచంలోనే సంతోషకర దేశం ఫిన్ ల్యాండ్.. భారత్ స్థానం ఏంటో తెలుసా?

మనిషి సంతోషంగా జీవించాలని అనుకుంటాడు. అందుకనుగుణంగా తన జీవన విధానం ఏర్పాటు చేసుకుంటాడు. ఈనేపథ్యంలో రోజు తన దైనందిన జీవితం సుఖంగా ఉండాలని కోరుకుంటాడు. ఈక్రమంలో ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశంగా ఫిన్ ల్యాండ్ గుర్తింపు పొందింది. వరసగా ఏడో సంవత్సరం కూడా టాప్ లో నిలిచి ఆశ్చర్యపరుస్తోంది. మరి ఆ దేశంలో ఎందుకు సంతోషంగా ఉంటారో తెలుసుంటే మనం కూడా అదే బాటలో పయనించవచ్చు కదా అనుకోవడం మామూలే. డెన్మార్క్, ఐస్ ల్యాండ్, స్వీడన్, ఇజ్రాయెల్ దేశాలు టాప్ 5లో నిలిచాయి. అఫ్గనిస్తాన్ మాత్రం చివరన నిలిచింది. 143వ స్థానానికి పడిపోయింది. ఆస్ట్రేలియా 10, యూకే 20, అమెరికా 23, జర్మనీ 24, చైనా 64, రష్యా 70వ స్థానాల్లో ఉన్నాయి. మనదేశం 126వ ర్యాంకును కలిగి ఉంది. పాకిస్థాన్ 108వ స్థానాన్ని ఆక్రమించింది. ఇలా పలు దేశాలు వాటి సమర్ధతను చాటాయి. ఫిన్ ల్యాండ్ ఎందుకు సంతోషకర దేశంగా మారిందంటే దేశ తలసరి ఆదాయం, సామాజిక మద్దతు, స్వేచ్ఛ, సమానత్వం వంటి అంశాలు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. అమెరికా, జర్మనీ లాంటి దేశాలు 20 స్థానాల కంటే కిందకు పడిపోయాయి. కోస్టారికా, కువైట్ దేశాలు టాప్ 20లోకి వచ్చాయి. అఫ్గనిస్తాన్, లెబనాన్, జోర్డాన్ ప్రజలు సంతోషాన్ని కోల్పోయినట్లు తెలుస్తోంది. ఫిన్ ల్యాండ్ ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండటానికి వారి పనులే కారణంగా చెబుతున్నారు. జీవితంలో ఎలా విజయం సాధించాలనే విషయాలపై వారికి అవగాహన ఎక్కువ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో 30 ఏళ్ల కంటే తక్కువ వయసు వారిలో సంతోషం తగ్గినట్లు తేలింది. 143 దేశాలపై జరిపిన పరిశోధనలో ఈ విషయాలు తెలిశాయి. సంతోషకర స్థాయిలో అసమానత ఐరోపాలో మినహా ప్రపంచ వ్యాప్తంగా పెరిగిందని తేలింది. ఇది ఆందోళనకరంగా మారుతోంది. తూర్పు ఐరోపాలో అన్ని వయసుల వారిలో సంతోషం పెరిగింది. పశ్చిమ ఐరోపాలో ఒకే రకమైన ఆనంద స్థాయిలను అనుభవిస్తున్నట్లు తెలుస్తోంది. పెద్ద వారితో పోలిస్తే తక్కువ వయసు వారే సంతోషంగా ఉన్నట్లు చెబుతున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ కరీం, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్









**హైదరాబాద్ మార్చి 21(ప్రభాత సమాచారం) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం సీనియర్ జర్నలిస్టు, ప్రభాత సమాచారం తెలుగు దిన పత్రిక సంపాదకులు సయ్యద్ కరీం, ఖానాపూర్ ఎమ్మెల్యేవెడ్మ భోజ్జు పటేల్ కలిశారు.**

# వాహనాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

### జిల్లా అంతటా చెక్ పోస్ట్ ల వద్ద పటిష్టమైన నిఘా





**ఆదిలాబాద్ మార్చి 21(ప్రభాత సమాచారం)**
ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో చెక్‌పోస్ట్‌ల వద్ద పటిష్ట నిఘా ఉంచారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనఖీ చేస్తున్నారు. గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా,జిల్లా ఎస్పీ గౌస్ ఆలంతో కలిసిఇంటర్ స్టేట్ చెక్ పోస్ట్ బొరజ్, పిప్పర్ వాడ టోల్ ప్లాజా చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లను ఆకస్మిక తనిఖీ చేశారు.వాహనాలను తనఖీ చెసారు. విస్తృత తనిఖీలు నిర్వహించి నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని అన్నారు.నగదు, మద్యం రవాణా నియంత్రించాలన్నారు. సిసి కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల తనిఖీ సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్ పోస్ట్ లో వీడియోగ్రఫీ కి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అప్రమత్తంగా వుంటూ, 24 గంటల పటిష్ట నిఘా పెట్టాలని అన్నారు.ఈ సందర్భంగా స్లీపర్ బస్ లో ప్రతీ సీటును, వెహికల్స్ ను స్వయంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తనిఖీ చేశారు.బేల మండలం శంకర్ గూడ జైనత్ మండలం పిప్పర్ వాడ టోల్ ప్లాజా,జైనథ్ మండలం అనంద్ పూర్‌భీంపూర్ మండలం కరంజి.తలమడుగు మండలం లక్ష్మీపూర్. బోథ్ మండలం ఘన్ పూర్ లో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసారు




# ఈసీల నియామకంపై స్టేకు సుప్రీం నిరాకరణ

దిల్లీ: లోక్‌సభ ఎన్నికల ముందు ఈసీల నియామకం అంశం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం నూతనంగా తీసుకొచ్చిన చట్టాన్ని నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. చట్టంపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ దశలో నిలిపివేస్తే అది తీవ్ర గందరగోళానికి దారితీస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఇటీవల ఈసీలుగా బాధ్యతలు చేపట్టిన మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్ నియామకాలను కూడా ధర్మాసనం ప్రస్తావించింది. కొత్తగా నియమితులైన వారిపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంది. "ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థ. అది పాలనాయంత్రాంగం కింద పనిచేస్తుందని చెప్పకూడదు. ఈసీల నియామకాల కోసం కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పు అని భావించలేం. ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఈ సమయంలో సమతుల్యత పాటించాల్సిన అవసరం చాలా ముఖ్యం" అని ధర్మాసనం అభిప్రాయపడింది. 2023 చట్టం రూపొందించక ముందు ఎన్నికల కమిషనర్ల నియామక తాత్కాలిక కమిటీలో ప్రధాని, సీజేఐ, లోక్‌సభలో విపక్షనేత సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టం ప్రకారం ఏర్పడిన కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పించారు. దీన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై కేంద్రం బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. కొత్త చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది.

# అక్షర సత్యం.. రూ.లక్షలు మాయం!

ఖమ్మం : వయోజనులను అక్షరాస్యులుగా మార్చాలనే సంకల్పంతో ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాన్ని కొందరు అధికారులు భ్రష్టుపట్టించారు. ఉమ్మడి జిల్లాలో వయోజన విద్యాశాఖ అక్రమాల పుట్టగా మారింది. కొందరు ఉద్యోగులు రూ.లక్షలు కాజేసినట్లు సమాచారం. ఆ శాఖ రాష్ట్ర అధికారుల తనిఖీల్లో విస్తుపోయే అంశాలు వెలుగుచూడటం గమనార్హం.

ఆరేళ్ల కార్యకలాపాలపై ఆరా

2021 ఆగస్టు 23 నుంచి 29 వరకు, 2022 ఆగస్టు 17 నుంచి 21 వరకు ముగ్గురు అధికారులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తనిఖీలు నిర్వహించారు. 2015 మే 14 నుంచి 2021 ఆగస్టు 29 వరకు జరిగిన కార్యకలాపాలపై ఆరాతీశారు. షెడ్డుకు చేరిన కారు నంబరుతో అద్దె డబ్బులు డ్రా చేయటం, కొన్ని రకాల సామగ్రి కొన్నట్లు బిల్లులు పెట్టుకోవటం, ఇతర ఖర్చుల పేరిట రూ.లక్షలు కాజేయటం వంటి అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. అయినా అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవటం అనుమానాలకు తావిస్తోంది.

తాజాగా బిల్లుల తిరస్కరణ

వయోజన విద్య హైదరాబాద్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారికి ఇక్కడ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈశాఖలో క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు జరగటం లేదు. అయినా అద్దెకారు ఉపయోగించినట్లు నెలకు రూ.24వేల చొప్పున బిల్లులు పెట్టారు. అనుమానం రావటంతో బిల్లులను కోశాధికారులు తిరస్కరించారు.

తనిఖీల్లో వెలుగుచూసిన అంశాల్లో మచ్చుకు కొన్ని..

పెన్సిళ్లు, షార్ప్‌నర్స్, ఎరేజర్స్, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.36.76లక్షలు వెచ్చించారు. ల్యాబ్ టెస్టు లేకుండా, సామగ్రి వచ్చిందో లేదో తెలుసుకోకుండా చెల్లించారు.

కార్యాలయానికి ఉపయోగించిన కారుకు 2015 జనవరి, ఫిబ్రవరి,



మార్చి నెలలకు రూ.24వేల చొప్పున అద్దె చెల్లించారు. లాగ్‌బుక్, ఓచర్లు, ఒప్పందాలు లేకుండానే చెల్లింపులు జరిగాయి. ఫిట్‌నెస్ లేని షెడ్డులోని కారు పేరిట ఈతంతు సాగటం విశేషం.

2015 జులై నుంచి 2016 మార్చి వరకు కార్యాలయ నిర్వహణ ఖర్చుల కింద ఓ రెగ్యులర్ ఉద్యోగి రూ.68,319 వెనకేసుకున్నాడు. వాస్తవానికి రూ.1,000 దాటిన ప్రతి లావాదేవీకి సంబంధించి సదరు సంస్థలు లేదా వ్యక్తులకే చెల్లించాలి తప్ప ఉద్యోగులు తీసుకోకూడదు. 2016 నుంచి 2017 వరకు మూడు పర్యాయాలు రూ.1.20లక్షల వరకు ఓ ఉద్యోగి డ్రాచేశారు. 2017 మార్చి నుంచి డిసెంబర్ వరకు ఎనిమిది నెలల పాటు కార్యాలయ నిర్వహణ ఖర్చుల కింద రూ.1.06లక్షలు తీసుకున్నారు. స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయలేదు. ఎన్‌ఐఓఎస్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్) 11వ రౌండ్ పరీక్షలు 2015 ఆగస్టు 28న జరిగాయి. వీటి పేరిట రూ.2.30లక్షలు వెచ్చించినా ఓచర్లు లేవు. 12వ రౌండ్‌లో రూ.3.12లక్షలు, 15వ రౌండ్‌లో 1.85లక్షలకు సంబంధించిన బిల్లులు లేవు.గతంలో రాష్ట్ర అధికారుల తనిఖీల్లో వెలుగుచూసిన అంశాలపై విచారణ జరుగుతోంది. వివిధ రకాల చెల్లింపులకు సంబంధించి ఆయా బ్యాంకర్ల నుంచి సమాచారం సేకరిస్తున్నాం. గత రెండు నెలలకు సంబంధించి నేను పెట్టిన బిల్లులను కోశాధికారులు తిరస్కరించిన మాట వాస్తవమే. విక్రమవర్మ, ఇన్‌ఛార్జి ఉపసంచాలకుడు, వయోజన విద్య

# గ్రామ పంచాయతీల్లో పన్నుల బకాయిలు

ఖమ్మం : గ్రామ పంచాయతీల్లో పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. పన్నుల వసూళ్లలో కొంత అలసత్వం నెలకొందనే విమర్శలున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం ఈ నెలతో ముగుస్తుంది. ఈ నెలాఖరు నాటికి డిమాండ్ మేరకు పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని 589 గ్రామ పంచాయతీల్లో శనివారం నాటికి 49.32 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. మిగతావి ఈ నెలాఖరు నాటికి వసూలు చేయాల్సి ఉంది. లేకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరానికి బకాయిలు మరింత పేరుకుపోతాయి. గత ఫిబ్రవరి 1 నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. సర్పంచులున్న సమయంలో పన్నుల వసూలుపై కొంత రాజకీయ ప్రభావం పడినా ప్రత్యేక అధికారులున్న సమయంలో కార్యదర్శులు పన్నుల వసూళ్లు వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. నెలాఖరు వరకు ఏ మేరకు పన్నులు వసూలు అవుతాయో వేచి చూడాలి. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు, బావులు, మోటార్లు మరమ్మతులపై పంచాయతీ అధికారులు దృష్టి సారించారు.



పంచాయతీ కార్యదర్శులపై ఇతరత్రా పనిభారం పెరిగింది. అందుకే పన్నుల వసూళ్లు నెమ్మదించాయి. పంచాయతీల్లో పన్నుల వసూలుపై దృష్టి సారించామని, ఈ నెలాఖరు వరకు నూరు శాతం పన్నులు వసూలు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పంచాయతీ అధికారి ఒకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

వసూలు చేయాల్సిన పన్నులు: రూ.10.90 కోట్లు
ప్రస్తుత ఆర్థిక సంవత్సరానివి: రూ.6.26 కోట్లు
గతేడాది బకాయిలు: రూ.4.64 కోట్లు

# బుద్వేల్, మోకిల లేఅవుట్లకు మోక్షం

హైదరాబాద్: ఎట్టకేలకు కీలమైన బుద్వేల్, మోకిల హెచ్ఎండీఏ లేఅవుట్ల అభివృద్ధి పనులకు మోక్షం లభించింది. ఈ రెండు లేఅవుట్లలో ప్లాట్లను వేలం ద్వారా గత ప్రభుత్వం విక్రయించింది. వేల కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరాయి. లేఅవుట్లలో ప్లాట్లు విక్రయించినప్పటికీ వసతుల కల్పనలో హెచ్ఎండీఏ తాత్సారం చేసింది. వాస్తవానికి 18 నెలల్లో లేఅవుట్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటికే గడువు ముగియడంతో కొనుగోలుదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఇటీవలే రూ.400 కోట్ల విలువైన అభివృద్ధి పనుల కోసం టెండర్లు పిలిచారు. నాలుగు సంస్థలు టెండర్లు దాఖలు చేయగా...ఎన్ఎన్సీ ఈ పనులు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. కోకాపేటలో 500 ఎకరాల్లో ఇదే సంస్థ వసతులను కల్పించింది.



మొత్తం నిధులు ఊడ్చేశారు..

గత ప్రభుత్వ హయాంలో భూముల వేలం ద్వారా వేల కోట్లు హెచ్ఎండీఏ ఖాతాలోకి చేరాయి. ఇవి ప్రభుత్వం అప్పటి అవసరాల కోసం వాడుకుంది. కనీసం లేఅవుట్లలో మౌలిక వసతులకు అవసరమైన నిధులను అప్పటి అధికారులు పక్కన పెట్టకపోవడంతో వసతుల కల్పనలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు టెండర్లు ఖరారు కావడంతో ఆయా లేఅవుట్లలో అభివృద్ధి పనులకు మార్గం సుగమం కానుంది. ఒక్క బుద్వేల్ లేఅవుట్ పనుల కోసమే రూ.350 కోట్ల వరకు కేటాయించనున్నారు. రాజేంద్రనగర్ సమీపంలో మెట్టపై ఈ లేఅవుట్ ఉంది. పెద్దపెద్ద బండరాళ్లను తొలగించడంతోపాటు రెండు వైపులా రహదారులు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. ఇక మోకిలలో 165 ఎకరాల లేఅవుట్ లో విడతల వారీగా ప్లాట్లను విక్రయించారు. గజం ధర రూ.లక్షపైనే పలికింది. తద్వారా హెచ్ఎండీఏకు భారీ ఎత్తున ఆదాయం వచ్చింది.

# వన్యప్రాణుల సంరక్షణే లక్ష్యం

పెద్దపల్లి : వేసవిలో ఎండల తీవ్రత పెరుగుతోంది. అడవుల్లోని నీటి వనరులు ఎండిపోతున్నాయి. దాహార్తి కోసం వన్యప్రాణులు విలవిలలాడే ప్రమాదం ఉంది. తాగునీటి కోసం ఆరు బయటకొచ్చిన అడవి జంతువులు వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న క్రమంలో అడవుల్లోని వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ ప్రణాళిక రూపొందించింది. అడవుల్లో సాసర్‌పిట్స్, చిన్ననీటి కుంటల్లో నీరు నింపే చర్యలు చేపట్టారు. అనుమానిత ప్రాంతాల్లో నిఘా తీవ్రతరం చేస్తున్నారు. వేటగాళ్ల బారినుంచి వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. గ్రామాల్లోకి తాగునీటి కోసం వన్యప్రాణులు వస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చేలా చైతన్యం కల్పిస్తున్నారు.

జిల్లాలో ఇలా..జిల్లాలో 14.20 శాతం అడవులున్నాయి. జిల్లాలో మంథని, రామగిరి, ముత్తారం, కాల్వ శ్రీరాంపూర్, పాలకుర్తి, ధర్మారం మండలాల్లో అటవీ సంపద విస్తీర్ణం ఎక్కువగా ఉండగా మిగితా మండలాల్లో తక్కువ నమోదు ఉంది. ఒకప్పుడు పులుల సంచారంతో ఉన్న మంథని ప్రాంతంలో వీటి ఆనవాళ్లు లేవు. అడవుల విస్తీర్ణం పెరగడం, నీరు సమృద్ధిగా లభిస్తుండటంతో ఇటీవల పులి సంచరించి పూర్వ ఆదిలాబాద్‌లో వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు ఉన్నాయి. జింకలు, కనుజు, దుప్పులు, కుందేళ్ల వంటి శాఖాహార జంతువుల సంచారం ఉంది. అటవీ ప్రాంతంలో వేటగాళ్లు ఉచ్చులు అమర్చుతుండటంతో వీటి సంతతి క్రమక్రమంగా తగ్గుతోంది.

నిరంతర పర్యవేక్షణ

జిల్లాలో 5,41,149 ఎకరాల్లో భౌగోళిక విస్తీర్ణం, 76,938.19 ఎకరాల్లో అటవీ విస్తీర్ణం ఉంది. జిల్లా వ్యాప్తంగా పెద్దపల్లి, మంథని



రేంజీల పరిధిలో 14 సెక్షన్లలో 40 బీట్‌లుగా విభజించారు. వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు 24 సాసర్‌పిట్లు ఉండగా వీటిలో మంథని రేంజీలో 15, పెద్దపల్లి రేంజీ పరిధిలో 9 ఉన్నాయి. వీటిలో నీరు నింపుతున్నారు. గతంలో నిర్మించిన సాసర్‌పిట్లను మనుగడలోకి తీసుకొస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో నిర్మించిన చెక్‌డ్యాంలు, చిన్న నీటి కుంటల వద్ద నిఘా పెంచుతున్నారు. నీటి కోసం వచ్చిన జంతువులను హతమార్చే ప్రమాదం ఉండటంతో అటవీ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ప్రజల్లో చైతన్యం

జిల్లాలో రెండు రేంజీల పరిధిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు నీటి ట్యాంకర్ల ద్వారా సాసర్‌పిట్స్‌లో నీటిని నింపుతున్నాం. నీటి కోసం వచ్చిన అడవి జంతువులను వధించరాదని సమీప గ్రామాల్లోని ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నాం. వేటాడితే కఠినచర్యలు తప్పవు. గ్రామాల్లోకి వన్యప్రాణులు వస్తే సమాచారం అందించాలి. శివయ్య, జిల్లా అటవీ అధికారి

# నాలాలు.. ప్రాణాలు తీయకుండా..



హైదరాబాద్: రాబోయే వర్షాకాలంలో నాలా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు జీహెచ్ఎంసీ చర్యలకు శ్రీకారం చుట్టింది. నాలా సేఫ్టీ ఆడిట్ పేరుతో ప్రమాదకర వరద కాలువల దుస్థితిని గుర్తించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఎల్బీనగర్, కూకట్‌పల్లి జోన్లలో ప్రక్రియ మొదలైంది. మిగిలిన ఆరు జోన్లలో త్వరలో మొదలుకానుందని ఇంజినీర్లు స్పష్టం చేస్తున్నారు. నాలాలతోపాటు వరద నీటి మ్యాన్‌హోళ్ల పొడవునా సర్వే చేపట్టి ధ్వంసమైన మ్యాన్‌హోళ్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ ధీమా వ్యక్తం చేసింది.

సర్వేకు ప్రైవేటు సంస్థలు..

గతంలో నాలా సేఫ్టీ ఆడిట్‌ను ఇంజినీర్లే చేపట్టారు. ఈ దఫా ప్రైవేటు ఏజెన్సీలతో బల్దియా ఇంజినీరింగ్ విభాగం అధ్యయనం చేయిస్తోంది. ఆయా సంస్థలు జోన్లవారీగా 30 సర్కిళ్లలోని నాలాలు, వరద నీటి మ్యాన్‌హోళ్లను పరిశీలించి.. సమస్యలను వివరిస్తూ నివేదిక ఇస్తారు. వాటన్నింటినీ అధికారులు పరిష్కరించాల్సి ఉంటుంది. అందుకోసం జోన్లలో ప్రత్యేక బృందాలను నియమించామని, వర్షాకాలం ముగిసే వరకు ఆయా బృందాలు 24గంటలపాటు అప్రమత్తంగా ఉంటాయని అధికారులు తెలిపారు.

కొనసాగుతోన్న మరమ్మతులు..

నగరవ్యాప్తంగా అధ్వానంగా ఉన్న నాలాలకు మరమ్మతులు చేస్తున్నామని ఇంజినీరింగ్ విభాగం తెలిపింది. మొత్తం 979 పనులు చేపట్టగా, అందులో సగం మాత్రమే జరిగాయని, మిగిలిన వాటిని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చేపట్టామన్నారు. నిధుల కొరతతో ఈ ఏడాది కూడా సగం పనులే జరగడం గమనార్హం.

వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్డీపీ) కింద రూ.985కోట్లతో చేపట్టిన కొత్త నాలాల నిర్మాణ పనులు 60శాతం జరిగాయని తెలిపారు. చైతన్యపురి వద్ద జాతీయ రహదారిపై కూరుకుపోయిన ఆరు వరుసల కల్వర్టును పునరుద్ధరించామని, మినిస్టర్ రోడ్డు, బేగంపేట కరాచిబేకరీ రోడ్డు, చింతలబస్తీ నాలాపై కల్వర్టులను నిర్మించి ముంపును తప్పించామన్నారు.

మెహిదీపట్నం ఆర్మీ ప్రాంతంలో చేపట్టిన రెండు నాలా పనుల్లో రేతిబౌలి కూడలి వైపు చేపట్టిన నాలా నిర్మాణం పూర్తయిందని, బంజారహిల్స్ పింఛన్ ఆఫీసు వైపు విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. నిధుల సమస్యతో ఇటీవల పూడికతీత పనుల కోసం చేపట్టిన టెండర్లను గుత్తేదారులు బహిష్కరించారు. దాంతో.. గతంలోని పూడికతీత బిల్లులను బల్దియా వెంటనే చెల్లించింది. సమస్య పరిష్కారమవడంతో గుత్తేదారులు పూడికతీత పనులు చేపడుతున్నారు.

# వ్యర్థాలతోనూ ఆదాయం



హైదరాబాద్: ఇంట్లో వృథాగా ఉండే ఎలక్ట్రానిక్, ఇతర వ్యర్థాలను సొమ్ము చేసుకునే అవకాశం కల్పిస్తున్నాయి నగరానికి చెందిన ఎన్జీవోలు, అంకుర సంస్థలు. ఫోన్‌కాల్ లేదా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటికి వచ్చి బరువు ఆధారంగా ధర చెల్లించి తీసుకెళున్నారు. వాటిని రీసైక్లింగ్ యూనిట్లకు తరలించడం ద్వారా వ్యాపారంతోపాటు పరోక్షంగా పర్యావరణ పరిరక్షణకూ ఈ సంస్థలు తోడ్పడుతున్నాయి. నగరంలో ఏటా 7.51 లక్షల టన్నుల వ్యర్థాలు పోగవుతుంటే 20 శాతం మాత్రమే రీసైక్లింగ్ అవుతున్నాయి. మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లు, డిజిటల్ కెమెరాలు, ఎలక్ట్రానిక్ ఆటబొమ్మలు, వివిధ విడిభాగాలు ఏటా పెద్దసంఖ్యలో మార్కెట్‌లోకి వస్తున్నాయి. అందుకు తగ్గట్లే పాతబడినవి, పనికిరాకుండా పోయినవి ఇళ్లలో మూలకు చేరుతున్నాయి.

విరాళంగా ఇవ్వొచ్చు: 'భూమి' ఎన్జీవో కొన్నేళ్ల క్రితం 'గిఫ్ట్ యువర్ స్క్రాప్' పేరుతో వృథాగా పారేసే పునర్వినియోగ వ్యర్థాలను విక్రయించేలా లేదా బహుమతిగా ఇచ్చేలా వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఇలా సేకరించి రీసైక్లింగ్ యూనిట్లకు పంపుతారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని పేద విద్యార్థులకు ఉపకార వేతనంగా ఇస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. న్యూస్‌పేపర్లు, కార్టన్లు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను విరాళంగా ఇచ్చేవారు వివరాలకు 'భూమి' ఎన్జీవో వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చు.

స్క్రాప్‌క్యూ సంస్థలో..

24 చెట్లను నరికితే 1000 కిలోల కాగితం తయారవుతుంది. కాగిత వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తే ఆ చెట్లను కాపాడినట్టే అనే నినాదంతో పనిచేస్తోంది స్క్రాప్‌క్యూ. నగరంలో 2300 మంది ఏజెంట్లతో ఈ సంస్థ త్వరితగతిన సేవలు అందిస్తోంది. సీడీలు, పాత క్యాసెట్‌లు, పాడైన రిఫ్రిజిరేటర్, మైక్రో ఓవెన్ తదితరాలకు ఎంతెంత ధర నిర్ణయిస్తున్నారో వెబ్‌సైట్‌లో స్పష్టంగా పేర్కొంటారు. పరిమాణాన్ని బట్టి ధర మారొచ్చు. బుకింగ్ చేసుకోవాలంటే %https://www. scrapq.com% వెబ్‌సైట్ లేదా ఫోన్ 040-30707070లో సంప్రదించాలి.

క్రాప్‌బిన్ సంస్థలో..

2018లో ప్రారంభించిన ఈ అంకుర సంస్థలో 20 మంది పనిచేస్తున్నారు. ప్రస్తుతం కొండాపూర్, మాదాపూర్, కూకట్‌పల్లి, నిజాంపేట, బాచుపల్లి, యాప్రాల్, సైనిక్‌పురి, కేపీహెచ్‌బీ, నల్లగండ్ల, తెల్లాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బేగంపేట, బంజారాహిల్స్, పంజాగుట్ట, మణికొండ, అల్కాపూర్, పుప్పాలగూడ, ఖైరతాబాద్, టోలిచౌకి, షేక్‌పేట, హిమాయత్‌నగర్, అమీర్‌పేట, కాచిగూడ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారు. గృహ, వాణిజ్య, ఆసుపత్రులు, సంస్థల్లో పోగైన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, పాత పత్రికలు, మ్యాగజైన్‌లు, గాజు వస్తువులు, మృదువైన ప్లాస్టిక్, స్టీల్, అల్యూమినియం, కాపర్ తదితర లోహ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. మరిన్ని వివరాలకు %https://rapbin.com% వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు.

# ప్రత్యేక నిధుల రద్దు



కోనరావుపేట : అధికారుల అలసత్వం... పాలకుల నిర్లక్ష్యం వెరసి వాహనదారులు, ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పటం లేదు. ఏటా వానాకాలంలో పెంటివాగు లోలెవల్ కల్వర్టు కొట్టుకుపోయి స్థానికులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా సకాలంలో టెండరు ప్రక్రియ కాక నిధులు రద్దయ్యాయి. దీంతో పైవంతెన నిర్మాణం కలగా మారింది. కోనరావుపేట మండలం మరిమడ్ల నుంచి కోనరావుపేట మీదుగా సిరిసిల్ల జిల్లా కేంద్రం వరకు రోడ్లు, భవనాల శాఖ నిధులు రూ.36 కోట్లతో ఆరేళ్ల క్రితం సుమారు 35 కిలో మీటర్ల రెండు వరుసల తారు రోడ్డు నిర్మించారు. మూడేళ్లుగా భారీగా కురిసిన వర్షాలకు కోనరావుపేటలోని కొండం, మాసిన్, గద్దెగట్టు చెరువు మత్తడులతో పాటు అటవీప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా వచ్చిన వరద భారీగా పెంటివాగులో చేరుతుంది. దీంతో కొండాపూర్ శివారులోని పెంటివాగు లోలెవల్ కల్వర్టు భారీ వర్షాలకు కొట్టుకుపోయి రెండు నెలలు పైగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. మరమ్మతులు చేపట్టినప్పటికీ ఏటా ఇదే పరిస్థితి నెలకొంటుంది. మరమ్మతులతో నిధులు వృథా కావడమే కాకుండా స్థానికులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి గత ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు (ఎస్‌డీఎఫ్) మంజూరు చేసింది. దీంతో వాహనదారులు, ప్రయాణికుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భావించారు. ఈలోగా శాసనసభ ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పడింది. గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 కోట్లను రద్దు చేసింది. వంతెన నిర్మాణం కలగా మారింది. మళ్లీ వానాకాలంలో వర్షాలు కురిసి వరద వస్తే తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం నెలకొంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ముందుచూపు లేక...ఇంజినీరింగు అధికారులకు ముందుచూపు లేకపోవడం వల్లే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. రెండు వరుసల తారు రోడ్డు నిర్మాణం సమయంలోనే పైవంతెన కడితే ఈ సమస్య ఉండేది కాదు. సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి నిజామాబాద్ జిల్లా కేంద్రం వరకు మార్గంలో వెళ్తారు. మధ్యలో జాతీయ రహదారి-7 కూడా కలుస్తోంది. దీంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. తాత్కాలిక రోడ్డు సైతం ప్రమాదకరంగా మారింది. ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తక్షణమే నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టేలా కృషి చేయాలి.

లక్కం నారాయణ, మరిమడ్ల, వాహనదారుడు

త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం

గత ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేసిన రూ.10 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు రద్దు అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. నిధులు మంజూరు కాగానే గుత్తేదారు ఖరారుకు అవసరమైన ప్రక్రియకు కావాల్సిన అన్ని కాగితాలను సిద్ధం చేశాం. నిధుల మంజూరుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉన్నతాధికారుల నుంచి అవసరమైన వివరాలు తీసుకున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. సతీశ్, ఏఈ, ఆర్అండ్‌బీ, కోనరావుపేట

# జోన్ పరిధిలో మరో వ్యవసాయ కళాశాల

జగిత్యాల : ఉత్తర తెలంగాణ మండల కేంద్రకమైన జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం పరిధిలో పూర్వపు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలోని వ్యవసాయ పరిశోధన, విస్తరణ, బోధన సాగుతుండగా జిల్లాల్లో ఏటికేడు వ్యవసాయ డిగ్రీల సీట్లసంఖ్య పెరుగుతోంది. తాజాగా నిజామాబాద్‌లో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టగా స్థానిక రిజర్వేషన్లు, రైతుకోటా రిజర్వేషన్లతో మనప్రాంత విద్యార్థులకు అవకాశాలు మరింతగా పెరుగుతాయి.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జగిత్యాల పొలాస పరిశోధనస్థానం ఆవరణలో 2008లో వ్యవసాయ కళాశాల, 2013లో పీజీ కళాశాలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ కళాశాలలో సీట్లసంఖ్యను 120 నుంచి 150కి, పీజీలో సీట్లు 11 నుంచి 14కు పెంచారు. తదుపరి ఏర్పాటు చేసిన సిరిసిల్ల వ్యవసాయ కళాశాలలో 100 సీట్లు భర్తీ చేస్తుండగా నిరుడు ఆదిలాబాద్‌లో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశారు. రానున్న విద్యాసంవత్సరంలో నిజామాబాద్‌లో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయటం ద్వారా స్థానికంగానే విద్యార్థులు వ్యవసాయ విద్యను నేర్చుకునే వీలు కలుగుతుంది.

బాలికలే అధికం..

పొలాస పరిశోధనస్థానం ఆవరణలో 1996లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పరచగా ఇందులో 30-50 వరకు సీట్లు భర్తీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని కోరుట్లలో వెటర్నరీ కళాశాల, కరీంనగర్‌లో పాలిటెక్నిక్, జమ్మికుంటలో వ్యవసాయ పాలిటెక్నిక్, రామగిరిఖిలాలో ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా వీటిల్లోనూ స్థానిక



విద్యార్థులూ అధికంగానే ఉన్నారు. ఇదివరకు వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యాన తదితర కోర్సుల కళాశాలల్లో చదివిన వందలాది మంది జిల్లా విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి కల్పనతో ముందుకు సాగుతుండగా కళాశాలలు, సీట్లపెంపు మరికొందరికి ఉపకరించనుంది. కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పులే గురుకుల కళాశాలలోనూ బాలికలకు వ్యవసాయ డిగ్రీ కోర్సును అమలు చేస్తున్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) గుర్తింపున్న ప్రైవేటు కళాశాలలు రాష్ట్రంలో లేకపోగా కేవలం ప్రభుత్వ వ్యవసాయ వర్సిటీ ఆధ్వర్యంలోని కళాశాలల్లోనే వ్యవసాయడిగ్రీ కోర్సులుండటంతో వీటికి అధిక గిరాకీ ఉంది. వ్యవసాయ వర్సిటీ పరిధిలో యాజమాన్య కోటాకింద డిగ్రీ సీటు రూ.14 లక్షలుగా ఉండటం ఈ కోర్సులపై డిమాండ్‌ను వెల్లడిస్తోంది. ఈ నేపథ్యంలో వర్సిటీ పరిధిలోని కళాశాలలు, సీట్లసంఖ్యను పెంచగా ఎంసెట్ ర్యాంకులు, స్థానిక రైతుకోటా, ఇతర రిజర్వేషన్ల ద్వారా సీట్లను భర్తీ చేస్తుండగా ఉమ్మడి జిల్లాలోని చాలామంది విద్యార్థుల చేరికకు దోహదం చేయనుంది. మరోవైపు వ్యవసాయ, ఉద్యాన పాలిటెక్నిక్, వెటర్నరీ డిగ్రీ కోర్సుల్లో దాదాపు 60 శాతానికిపైగా బాలికలే చేరుతుండటం విశేషంగా చెప్పవచ్చు.

# పట్టణానికి దూరం.. అభివృద్ధిలో నిర్లక్ష్యం

కోరుట్ల : కోరుట్ల పట్టణ శివారు కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలోనున్న అర్బన్‌కాలనీ, అయోధ్యపట్నం, బంజారా కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2007లో అప్పటి ప్రభుత్వం పట్టణానికి దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో సుమారు 800 ప్లాట్లు ఏర్పాటు చేసి అర్బన్ కాలనీని నెలకొల్పింది. నిరుపేదలు ఇళ్లను నిర్మించుకుని 15 ఏళ్లకుపైగా నివాసముంటున్నారు. అయోధ్యపట్నం, బంజారా కాలనీల్లో వందకుపైగా ఇళ్లు నిర్మించుకున్నారు. వెయ్యికిపైగా ఇళ్లు ఉన్నా వైకుంఠధామం నిర్మించకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం వైకుంఠధామం ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించినట్లు ప్రకటించారు. ప్రభుత్వ స్థలం గుర్తించగా చుట్టుపక్కల భూయజమానులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వదిలేశారు. ఎవరైనా చనిపోతే ఎరుకల వాడలోని శ్మశాన వాటికకు తీసుకెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నా అవి సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. భగీరథ పైపులైన్ మరమ్మతు సమయంలో కాలనీలో రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతుంది. ప్రధాన రహదారి మినహా అంతర్గత సీసీరోడ్లు వేయలేదు. చాలా ఇళ్లపైనుంచి విద్యుత్తు తీగలు వెళ్లడంతో ప్రమాదకరంగా మారింది. చెత్తసేకరణ వాహనాలు, పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు రాకపోవడంతో చెత్త పేరుకుపోతుంది. కౌన్సిలర్ అనారోగ్యంతో మరణించి మూడేళ్లవుతున్నా ఎన్నిక నిర్వహించకపోవడంతో సమస్యలను పట్టించుకునేవారు కరవయ్యారు.

మూడు కి.మీ.లు నడవాల్సిందే..

అర్బన్‌కాలనీ ఏర్పడి 16 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు కాలనీ ఆవరణలో శ్మశానవాటికను ఏర్పాటు చేయడం లేదు. ఎవరైనా చనిపోతే మూడు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు.

ప్రసాద్, అర్బన్‌కాలనీ

నీటి సమస్యను తీర్చాలి

కాలనీలో నీటి ఇబ్బందులు ఉన్నాయి. మిషన్ భగీరథ నీరు తక్కువగా రావడంతో సరిపోవడం లేదు. కుళాయిలు రానప్పుడు చేతిపంపు ద్వారా నీటిని పట్టుకుంటూ ఇబ్బంది పడుతున్నాం. బీడీలు చేసుకుని బతికే మాలాంటి వారు ఇళ్లలో బోర్లు వేసుకునే పరిస్థితులు లేవు. మున్సిపల్ అధికారులు కాలనీలో నీటి ట్యాంకులను ఏర్పాటు చేయాలి.

మానస అర్బన్‌కాలనీ



**బేగంబజార్‌లో.. ముందే వచ్చిన రంగుల హోలీ..** బేగంబజార్‌లో హోలీ ముందే వచ్చింది. అందరూ పౌర్ణమిరోజున హోలీ వేడుకలు జరుపుకొంటుండగా, ఇక్కడి మహిళలు మాత్రం రంగభరి రోజున.. అంటే ఫాల్గుణమాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి రోజున హోలీ ఆడడం ఆనవాయితీగా వస్తున్నది. రంగోలి వేడుకలో ఉన్న మహిళలను చిత్రంలో చూడొచ్చు.

# ఇంజినీర్లతో రెండో రోజూ ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ భేటీ




హైదరాబాద్: ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నిపుణుల కమిటీ రెండో రోజు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఇంజినీర్లతో సమావేశమైంది. ఎర్రమంజిల్‌లోని జలసౌధలో చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ ఇంజినీర్లతో విడివిడిగా చర్చలు జరుపుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ డిజైన్ల వివరాలపై ఆరా తీస్తోంది. వాటిని రూపొందించిన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఇంజినీర్లతో ఇప్పటికే బుధవారం సమావేశమైంది. గురువారమూ ఈ భేటీ కొనసాగింది. ప్రాజెక్టు నిర్మాణంలో బాధ్యులైన ఇంజినీర్లతో విడివిడిగా సమావేశమవుతున్న చంద్రశేఖర్ అయ్యర్, సభ్యులు.. డిజైన్లకు సంబంధించిన వివరాలు తీసుకుంటున్నారు. ఆనకట్టల నిర్వహణ బాధ్యతలు చూసే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం నుంచి కమిటీ సమగ్ర వివరాలు కోరింది.

2019లో సమస్యలు ఉత్పన్నమైనప్పటి నుంచి తీసుకున్న చర్యలు, చేపట్టిన తనిఖీల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణ పనులు చేసిన గుత్తేదార్ల ప్రతినిధులతోనూ నేడు సమావేశం కానుంది. మూడు ఆనకట్టల మోడల్స్‌ను కమిటీ శుక్రవారం పరిశీలించనుంది.

# పార్కింగ్‌కు సమగ్ర పాలసీ.. సమస్యకు చెక్ పెట్టేలా జీహెచ్‌ఎంసీ కసరత్తు

## మల్టీ పర్పస్ పార్కింగ్ కాంప్లెక్సులపై దృష్టి - ప్రత్యేక పోర్టల్/మొబైల్ యాప్ ద్వారా సమాచారం

హైదరాబాద్ : మహానగరంలో పార్కింగ్ చిక్కులకు చెక్ పెట్టాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. ప్రధాన రహదారులపై వాహనాల పార్కింగ్ చేయడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి కసరత్తు ప్రారంభించింది. సమగ్ర పార్కింగ్ పాలసీ రూపకల్పనకు సిద్ధమైంది.

ఈమేరకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉన్నతాధికారులతో కమిషనర్ రోనాల్డ్‌రోస్ చర్చించారు. ఓ ఏజెన్సీ పార్కింగ్ నిర్మాణ నమూనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించింది. అధునాతన మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్సులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రైవేట్ స్థలాల యజమానులు పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు ముందుకు వస్తే.. వారికి ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలి..? రుసుము వసూలు తదితర అంశాలకు సంబంధించి విధివిధానాలు రూపొందించాలన్నారు. ప్రధాన రహదారులతో పాటు ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కాలనీ రోడ్ల పక్కనా పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని




తెలిపారు. వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్ సౌకర్యం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ స్థలాల వద్ద ప్రకటనల ఏర్పాటు ద్వారా జీహెచ్‌ఎంసీ ఆదాయం పెరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పార్కింగ్ సదుపాయాల వివరాలను వాహనదారులు సులువుగా తెలుసుకునేలా ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.

# శ్రీశైలం, సాగర్ నీళ్లను జగన్‌కు అమ్ముకున్న బీఆర్‌ఎస్

మిర్యాలగూడ : శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల నుంచి కృష్ణా జలాలను ఏపీ సీఎం జగన్‌కు అమ్ముకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుల్లో బురదను మిగిల్చిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని పలు ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొన్నారు. మార్గం మధ్యలో వేములపల్లి, మిర్యాలగూడ ప్రాంతాల్లోని మిల్లు పాయింట్ల వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలు కరువు రూపంలో రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెసతోనే కరువు వచ్చిందనడం మాజీమంత్రి జగదీషరెడ్డి తెలివితక్కువ తనమన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో జైలుకు పోయేవారు ఇంకా చాలామంది ఉన్నారని, త్వరలో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మిల్లర్లు సిండికేట్ అయి గిట్టుబాటు ధర చెల్లించటం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ... సన్నధాన్యానికి క్వింటాకు రూ. 2,800 ధర చెల్లించని మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది.. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లులపై చర్యలు తీసుకోవాలని జేసీ, డీఎసవోలకు ఫోన్‌లో ఆదేశించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




# ప్రణీత్‌రావుకు చుక్కెదురు.. పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీ ప్రణీత్‌రావుకు హైకోర్టులో చుక్కెదురైంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసు కస్టడీకి అప్పగిస్తూ కిందికోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆయన సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తొలుత పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది గంద్ర మోహన్‌రావు వాదించారు. అనంతరం పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. కింది కోర్టు ఉత్తర్వుల ప్రకారమే కస్టడీలో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పోలీసు స్టేషన్‌లో కనీస వసతులు ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదుదారు అయిన ఏసీపీ రమేశ్‌కు దర్యాప్తులో పాత్ర లేదన్నారు. ????

పిటిషనర్.. తన న్యాయవాది ఫోన్ ద్వారా తల్లిదండ్రులతోనూ మాట్లాడుతున్నారన్నారు. ఏడు రోజుల కస్టడీలో 4 రోజులు పూర్తయ్యాయని.. మిగిలింది మూడు రోజులేనని, ఉపయోగంలేని ఈ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రణీత్‌రావు పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

# లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరిలో కాంగ్రెస్ గెలుపు తనకు మరింత బాధ్యతను పెంచుతుందని అన్నారు. తన బలం, బలగం ఇక్కడి నేతలేనని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఇక్కడ ఎంపీ సీటు గెలవాల్సిందేనని అన్నారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం మల్కాజ్‌గిరిదని వివరించారు. తాను సీఎంగా ఉన్నానంటే ఆ గొప్పతనం ఇక్కడి నాయకులదేనని తెలిపారు. గురువారం నాడు గాంధీభవన్‌లో మల్కాజ్‌గిరి కీలక నేతలతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... 2019లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పతనం ఇక్కడి నుంచే మొదలైందన్నారు. ఆ నాడు కొంతమంది నాయకులు అమ్ముడుపోయినా కార్యకర్తలు తనను ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపించారని గుర్తుచేశారు. మల్కాజ్‌గిరిలో ఉన్న 2,964 పోలింగ్ బూత్‌లలో కాంగ్రెస్ కార్యకర్తలు తన గెలుపు కోసం ఎంతగానో కష్టపడ్డారని చెప్పారు. ఇక్కడి నుంచి తన గెలుపు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసిందని తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజులు పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ. 10లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేసుకుంటున్నామని చెప్పారు. మూడు నెలల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని వివరించారు. మల్కాజ్‌గిరి అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండి స్కైవేల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని చెప్పారు. ఇక్కడకు మెట్రో, ఎంఎంటీఎస్ రావాలన్నా జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కావాలన్నా కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించుకోవాలని



కోరారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థికి ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదని అన్నారు.

**ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి :** మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ గెలిస్తేనే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవాలని చెప్పారు. వచ్చే హోలీ పండుగలోగా అధిష్ఠానం ఎంపీ అభ్యర్థులను ప్రకటిస్తుందని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన నేతలను ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదని చెప్పారు. మనకు బలమైన నాయకత్వం ఉందని.. సమన్వయంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎంపీ ఎన్నికల కోసం ఓ కమిటీని వేసుకోవాలని చెప్పారు. వారికి పోలింగ్ బూత్‌ల వారీగా పని విభజనను అప్పగించి రోజువారిగా సమీక్షించుకోవాలని చెప్పారు. రేపు(శుక్రవారం) సాయంత్రం కంటోన్మెంట్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించుకోవాలని తెలిపారు. ఉదయం 7 గంటలకే నాయకులు బస్తీల్లో ప్రచారం చేసుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని వివరించారు. మల్కాజిగిరి క్యాంపెయిన్ మాదిరిగానే రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోసం ప్రచారం నిర్వహించేలా చూస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# పంట నష్టం.. ప్రతి ఎకరాకు రూ.10 - 15 వేల పరిహారం: మంత్రి జూపల్లి



భిక్కనూరు: వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం అంతంపల్లి, జంగంపల్లి, దోమకొండ మండలం లింగుపల్లి గ్రామాల్లో పొలాలను మంత్రి పరిశీలించారు. వర్షం కారణంగా పంట నష్టం జరిగిన ప్రతి ఎకరాకు రూ. 10 వేల నుంచి 15వేల వరకు పరిహారం ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి రైతును ఆదుకుంటాం.. అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. ఇప్పటికే 58.6 లక్షల మంది రైతులకు రైతు భరోసా సొమ్ము అందిందని, వచ్చే వారం రోజుల్లో మిగిలిన రైతులకు కూడా అందుతుందన్నారు. పదేళ్లు పాలించిన భారాస.. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆ ఐదు స్థానాల అభ్యర్థుల ఎంపికపై కేసీఆర్ తర్జనభర్జన

హైదరాబాద్, మార్చి 21: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీ నేతలు తమ అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బిజీబిజీగా ఉన్నాయి. మొత్తం 17 పార్లమెంటు స్థానాలకు గానూ పలువురు అభ్యర్థులను ఇప్పటికే పార్టీలు ప్రకటించేశాయి. అయితే ఇటీవల తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్.. ఎంపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించేశారు కూడా. అయితే ఐదు స్థానాలపై మాత్రం పార్టీలో సస్పెన్స్ కొనసాగుతోంది. మెదక్, సికింద్రాబాద్, నల్గొండ, భువనగిరి, హైదరాబాద్ స్థానాలు ఇంకా పెండింగ్లోనే ఉన్నాయి.

ఈ ఐదు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన కాస్త ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెండింగ్ స్థానాల అభ్యర్థుల కోసం కేసీఆర్ మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది.

నేతలు పార్టీ వీడుతుండటం కూడా అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారిన పరిస్థితి. నల్గొండ నుంచి బరిలో నిలపడానికి మొదట గుత్తా అమిత్ రెడ్డి పేరును బీఆర్‌ఎస్ పరిశీలించింది. అయితే



అమిత్ రెడ్డి పోటీకి నో చెప్పడంతో సైదిరెడ్డికి గులాబీ పెద్దలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సైదిరెడ్డి కూడా బీజేపీలోకి వెళ్లడంతో అభ్యర్థి కోసం గులాబీ బాస్ తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నల్గొండ కోసం కంచర్ల కృష్ణారెడ్డి, కడారు అంజయ్య యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే బీఆర్‌ఎస్ అధినేత మాత్రం కంచర్ల కృష్ణారెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

# సార్వత్రిక ఎన్నికల వేళ.. ఈసీ బదిలీల వేటు

దిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల సంఘం బదిలీల వేటు కొనసాగిస్తోంది. తాజాగా అస్సాం, పంజాబ్‌లోని జిల్లా స్థాయి పోలీసు ఉన్నతాధికారుల్ని బదిలీ చేసింది. ప్రముఖ రాజకీయ నాయకులతో బంధుత్వం ఉన్న అధికారులను ఆ విధుల నుంచి పక్కనపెట్టామని తెలిపింది. ఆ పోస్టులు ఐఏఎస్, ఐపీఎస్ కేడర్ అధికారులకు కేటాయించినవి కావడంతో ఈ చర్యలు తీసుకుంది. అలాగే పంజాబ్, ఒడిశా, గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో నాన్ ఎన్‌కేడర్ జిల్లా మేజిస్ట్రేట్లు, ఎస్పీలను ఇతర విభాగాలకు మార్చాలని ఆయా ప్రభుత్వాలకు సూచించింది. ఇటీవల పశ్చిమ్ బెంగాల్ డీజీపీతో పాటు 6 రాష్ట్రాల హోంశాఖ కార్యదర్శులను తప్పించిన సంగతి తెలిసిందే. వారితోపాటు రెండు రాష్ట్రాల్లో సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శులను బదిలీ చేసింది. ఎన్నికలకు సంబంధంలేని విధులకు డీజీపీ రాజీవ్ కుమార్‌ను బదిలీ చేయాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఈసీ ఆదేశించింది. ఆయనకు జూనియర్‌గా ఉన్న అధికారిని డీజీపీగా తాత్కాలికంగా నియమించాలని సూచించింది. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, గుజరాత్, ఝార?ండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ హోంశాఖల కార్యదర్శులపైనా ఈసీ వేటు వేసింది.

వీరంతా ముఖ్యమంత్రి కార్యాలయంతోపాటు మరో చోట విధులను నిర్వర్తిస్తున్నారని పేర్కొంది. దీనివల్ల ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు భంగం కలుగుతుందని భావించినట్లు వెల్లడించింది. కాగా, ఏడు దశల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటికే షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 19న తొలివిడత పోలింగ్ జరగనుంది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660